క్లుప్తంగా

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో ఆదివారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇబ్రహీంపట్నం విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఏఈ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు నగరానికి తేజస్వినిరెడ్డి మృతదేహం


తేజస్వినిరెడ్డి

తుర్కయంజాల్‌: ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్లి అక్కడ ఈ నెల 14వ తేదీన బ్రెజిల్‌కు చెందిన దుండగుడి చేతిలో హత్యకు గురైన పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన కొంతం తేజస్విని రెడ్డి (27) మృతదేహం ఎట్టకేలకు ఆదివారం నగరానికి చేరనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్‌ ఎయిర్‌పోర్ట్‌కు ఆదివారం ఉదయం 8 గంటల వరకు చేరుకుంటుందని సమాచారం. తేజస్వినిరెడ్డి హత్యకు గురైన విషయం తెలిసినప్పటి నుంచి ఆమె తల్లిదండ్రులు కొంతం శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవిలు కన్నీటి పర్యంతమవుతున్నారు. కూతురిని కడసారైన చూడాలనే ఆవేదనతో 10 రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం బ్రాహ్మణపల్లిలోని స్వగృహానికి మృతదేహం చేరాక అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మంచాల: మనస్తాపంతో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలోని చెన్నారెడ్డిగూడలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవినాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం చెన్నారెడ్డిగూడకు చెందిన జాటోత్‌ సునీత భార్యాభర్తలు మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సునీత ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తుర్కయంజాల్‌: రైతుల శ్రేయస్సు కోసమే సహకార సంఘాలు పనిచేస్తున్నాయని తుర్కయంజాల్‌ రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌, డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ కొత్తకుర్మ సత్తయ్య తెలిపారు. బ్రాహ్మణపల్లికి చెందిన సత్యనారాయణ ఈ నెల 20వ తేదీన మరణించడంతో వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రూ. 25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సంఘం వైస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, డైరెక్టర్లు స్వప్న శ్రీనివాస్‌, సంజీవ రెడ్డి, యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, కౌన్సిలర్‌ మల్లేష్‌, సంఘం సెక్రటరీ వై. రాందాసు, మాజీ డైరక్టర్‌ మర్రి సంపతీశ్వర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్‌
ఆందోళనలో గ్రామస్తులు


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్‌: మండలంలోని లష్కర్‌గూడలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ పేలి భారీ శబ్దం వచ్చింది. గ్రామంలోని చాలా మంది ఇళ్లలో విద్యుత్‌ పరికరాలు కాలిపోయాయి. ఓ మహిళకు గాయాలయ్యాయి. దీంతో విద్యుత్‌ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సబ్‌స్టేషన్‌ ఎదుట గ్రామస్తులు నిరసన తెలిపారు.

గురునానక్‌ కళాశాల గుర్తింపును రద్దు చేయండి

ఇబ్రహీంపట్నం: గురునానక్‌ ఇంజినీరింగ్‌ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్‌, క్రాంతిలు మాట్లాడుతూ.. అనుమతి లేకుండా యూనివర్సిటీ పేరుతో అడ్మిషన్లు తీసుకొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేసిన గురునానక్‌ కళాశాల యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలన్నారు. ఫీజుల రూపంలో సుమారు 180 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తు నష్టపోకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాలని డిమాండ్‌ చేశారు. గవర్నర్‌ తమిళిసై జోక్యం చేసుకొని చర్యలు చేపట్టాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యాసంస్థలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థుల పేరెంట్స్‌పై పోలీసులు లాఠీచార్జి చేసి కేసులు పెట్టడాన్ని తీవ్రంగా వారు ఖండించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సూర్య, అఖిల్‌, గణేశ్‌, విజేందర్‌, రాజు, గాలయ్య తదితరులు ఉన్నారు.

వసూళ్లు ఎట్లా?

- పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతులు
- 120 మందికిపైగా రూ.రెండున్నర కోట్ల రుణాలు
- వడ్డీ, చక్రవడ్డీలతో కలిపి రెండింతలైన అప్పులు
- ఫార్మాసిటీకి భూములిచ్చి నష్టపోయాం.. రుణాలు చెల్లించలేమంటున్న రైతులు


యాచారం పీఏసీఎస్‌ కార్యాలయం

యాచారం: ఫార్మాసిటీ భూబాధితుల నుంచి రుణాల వసూళ్లు పీఏసీఎస్‌ అధికారులకు తలకు మించిన భారంగా మారింది. రుణాలు చెల్లించాలని రైతుల ఇళ్ల చుట్టూ బ్యాంకు అధికారులు చెప్పులరిగేలా తిరి గినా ఫలితం లేదు. పలుమార్లు నోటీసులు జారీ చే సిన రైతులు పట్టించుకోవడం లేదు. యాచారం పీఏసీఎస్‌(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్‌, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 120 మంది రైతులు దాదాపు 250 ఎకరాలకు పైగా భూమికి 2007 నుంచి 2016 వరకు రూ. రెండున్నర కోట్లకు పైగా దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు పొందారు. కేసీఆర్‌ సర్కార్‌ ఏర్పాటైన అనంతరం ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయించింది. 2017 నుంచి యాచారం మండలంలోని సదరు గ్రామాల్లోని అసైన్డ్‌, పట్టా భూములను టీఎస్‌ఐఐసీ ఫార్మాసిటీకి సేకరించడం ప్రారంభించింది.

రూ. 5 కోట్లకు పెరిగిన అప్పులు

రైతులకు చెందిన రూ. రెండున్నర కోట్ల అప్పులు ప్రతి యేటా వడ్డీ, చక్రవడ్డీలు కలిపి ప్రస్తుతం రూ. 5 కోట్లకు పైగానే అప్పులు పెరిగాయి. భూసేకరణ సమయంలోనే పీఏసీఎస్‌ అధికారులు రెవెన్యూ అధికారులకు రైతుల పేర్లతో కూడిన లిస్టును అందజేశారు. రుణాలు పొందిన రైతుల భూములు ఫార్మాసిటీకి తీసుకుంటే తమకు సమాచారం ఇవ్వాలని, లేదంటే అప్పు బకాయిలు చెల్లించుకుని మిగితా డబ్బులు రైతులకు ఇవ్వాలని కోరారు. రైతుల పేర్లు, అప్పు బకాయి వివరాలు ఇచ్చిన రెవెన్యూ అధికారుల నుంచి స్పందన లేకుండా పోయింది. ఫార్మాసిటీకి మొదట్లో భూములు ఇచ్చే విషయంలో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. దీంతో పీఏసీఎస్‌ అధికారుల మాటను పట్టించుకోకుండానే రెవెన్యూ, టీఎస్‌ఐఐసీ అధికారులు ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు పరిహారం చెక్కులు అందజేశారు.

భూములే ఇచ్చాం.. ఇక అప్పు ఎక్కడిది..

దాదాపు 7 వేల ఎకరాలకు పైగా పట్టా, అసైన్డ్‌ భూములను ఫార్మాసిటీకి సేకరించారు. అసైన్డ్‌ భూమి ఎకరాకు రూ. 8 లక్షలు, పట్టాభూమి ఎకరాకు రూ. 12.50 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారు. నేడు అధిక శాతం మంది రైతులు జీవనోపాధులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని వ్యవసాయ భూములు కోల్పోయి, బతుకు దెరువు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా రు. ఈ సమయంలో ఆ రైతులకు పీఏసీఎస్‌ అధికా రులు అప్పు బకాయిలు చెల్లించాలని నోటీసులు ప ంపిన స్పందన లేదు. ఫార్మాసిటీకి భూములిచ్చే న ష్టపోయాం. అప్పులు ఎలా చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు ఎలా వసూలు చేయా లో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.


నక్కర్తమేడిపల్లిలో ఫార్మాసిటీకి సేకరించిన రైతుల అసైన్డ్‌, పట్టా భూములు

భూములు కోల్పోయి..



గ్రామంలోని 15 మంది రైతులు 2007 నుంచి 2015 వరకు రూ. 50 లక్షలకు పైగానే దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలు పొందారు. అధికారులు బలవంతంగా ఫార్మాసిటీకి భూములు తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం జీవనోపాధులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పూట గడవడమే ఆ రైతుల ఇళ్లల్లో కష్టంగా ఉంది. భూములు ఇచ్చినప్పుడే అప్పులు చెల్లించుకుంటే బాగుండేది.
– దంతుక పెద్దయ్య, సర్పంచ్‌, నానక్‌నగర్‌

బకాయిలు వసూలు చేస్తాం



పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతులు కచ్చితంగా అప్పులు చెల్లించాల్సిందే. ఇప్పటికే పలుమార్లు నోటిసులు ఇచ్చాం. ఫార్మాసిటీకి భూములు తీసుకునే సమయంలోనే రైతుల అప్పు వివరాలను రెవెన్యూ, టీఎస్‌ఐఐసీ అధికారులకు తెలియజేశాం. వారు సహకరించకపోగా భూములు తీసుకుని పరిహారం చెక్కులను రైతులకు ఇచ్చేశారు. త్వరలో స్పెషల్‌ డ్రైవ్‌ పెట్టి వసూల్‌ చేస్తాం. రైతుల నుంచి సహకారం లేకపోతే వారి అస్తులు జప్తు చేస్తాం.
– శ్రీనువాసులు, డీసీసీబీ సీఈఓ

నేడు ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: భగవాన్‌ శ్రీసత్యసాయి సేవ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం చర్లపటేల్‌గూడలో ఉచిత మొబైల్‌ మెడికల్‌ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఆసంస్థ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మెడికల్‌ క్యాంపులో సాధారణ వ్యాధులన్నింటికి అనుభవజ్ఞులైన వైద్యులు పరీక్షిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్‌లు నిర్వహించి, మెడిసిన్‌ను అందజేస్తారని చెప్పారు. చర్లపటేల్‌గూడతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

తలకొండపల్లి: కొత్తగా భూములు కొనుగోలు చేసి జూన్‌ 16 తేదీలోగా రిజిస్ట్రేషన్‌ చేయించుకున్న రైతులందరూ రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని శనివారం ఏఓ రాజు తెలిపారు. ఇందుకు భూమి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌ కార్డు, బ్యాంక్‌ అకౌంట్‌ ఖాతా పుస్తకం, దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. ఇదివరకు రైతుబంధు అందుకున్న రైతులు ఎవరైన తమ బ్యాంక్‌ ఖాతాలను మార్చుకోవాలనుకుంటే సదరు ఖాతా పుస్తకం జిరాక్స్‌లను అందజేయాలని సూచించారు. జిరాక్స్‌లను జత చేసి పూర్తి దరఖాస్తు పత్రాలను ఆయా గ్రామాల్లోని రైతు వేదికలో ఏఈఓలకు అందజేయాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి, వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తులేకలాన్‌కు చెందిన చెనమోని నర్సింహ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. సీఎంఆర్‌ఎఫ్‌ కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ సత్తు వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి సిఫారసు చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే రూ.60 వేల చెక్కును మంజూరు చేయించారు. ఈ చెక్కును శనివారం ఎల్మినేడులోని తన ఫాంహౌజ్‌లో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల పార్టీ అధ్యక్షుడు రాములు, గ్రామ సర్పంచ్‌ యాదగిరి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మయ్య, వెంకటేశ్‌, మహేందర్‌, మహేష్‌, నర్సింహాలు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న హరితహారం

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్‌: రాష్ట్రంలో హరితహారం సత్ఫలితాలు ఇస్తోందని, ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తోందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో హరితహార కార్యక్రమం ఆయన ప్రారంభించా రు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు, గ్రామ పంచాయతీల్లో నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, ఎవెన్యూ ప్లాంటేషన్స్‌, బండ్‌ ప్లాంటేషన్స్‌ తదితర వినూత్న కార్యక్రమాలు లేవన్నారు. తెలంగాణ ఏర్పాటు అయ్యాక ప్రతి సంవత్సరం హరితహారంలో భాగంగా, ప్రతి గ్రామ పంచాయతీలో పదివేల మొక్కలు నాటి సంరక్షించడం జరుగుతుందన్నారు. దీంతో వాతావరణ సమతుల్యత గతంలో కంటే ఎనిమిది శాతం పెరిగిందని తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో, హరితహారంలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి 2వేల మొక్కలు నాటినట్లు చెప్పారు. త్వరలోనే మండలంలో ఇంటింటికీ 6 పండ్ల మొక్కలు అందించనున్నట్లు చెప్పారు.


మొక్కలు నాటుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి, ఇతర నాయకులు

కార్యక్రమంలో వార్డు సభ్యులు నరేందర్‌రెడ్డి, అశోక్‌, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ వెంకటేశ్‌, ఈజీఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

6నుంచి జీపీ ఉద్యోగ, కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిషన్‌

ఇబ్రహీంపట్నం: జూలై 6 నుంచి తలపెట్టిన గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిషన్‌, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి యాదయ్యలు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో శనివారం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా గ్రామాల్లో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరిం చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. 51జీఓను వెంటనే సవరించి కనీస వేతనంగా 26 వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్‌ వర్కర్స్‌ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కారోబార్‌, బిల్‌ కలెక్టర్లకు స్పెషల్‌ స్టేటస్‌ కల్పించి అర్హులైన వారిని జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. సమ్మె నోటీసులను ఇప్పటికే అధికారులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్‌ గ్యార పాండుతోపాటు నర్సింహ్మారెడ్డి, శంకర్‌రెడ్డి, బషీర్‌, దేవదాస్‌, మాధవి, కృష్ణ, బుగ్గరాములు, నరేందర్‌, లింగం, బాలమణిలు పాల్గొన్నారు.

రేపు పాఠశాలల బంద్‌
ఏబీవీపీ నేత వంగ సంజీవరెడ్డి వెల్లడి

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలల బంద్‌ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం గ్రేటర్‌ హైదరాబాద్‌ జాయింట్‌ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యను వ్యాపారంగా మలుచుకొని పేద విద్యార్థులను మోసం చేస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. మన ఊరు– మనబడి పేరుతో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్‌ పాఠశాలల్లో దుస్తులు, పాఠ్యపుస్తకాల పేరుతో చేసే వ్యాపారాన్ని అరికట్టాలనే డిమాండ్లతో బంద్‌ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం
రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపకుడు శ్రీరామ శ్రీనివాస్‌

ఆమనగల్లు: సమస్యల సాధనకు పద్మశాలీయులంతా ఐక్యంగా ఉండాలని రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపకుడు శ్రీరామ శ్రీనివాస్‌ అన్నారు. పద్మశాలీయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు. పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో శనివారం మండల పద్మశాలి సంఘం సమావేశం అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. సభ్యత్వం పూర్తయిన తరువాత రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం కన్వీనర్‌ మల్లేశ్‌,జిల్లా కన్వీనర్‌, సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌, చేనేత సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ దుర్గయ్య, నాయకులు శివలింగం,సత్యరాములు, రవి, శ్రీను, అలివేలు, శ్రీలత,రవి, మాధవి పాల్గొన్నారు.

విద్యార్థుల వద్దకే ఉచిత బస్‌ పాసులు



పాసులను అందజేస్తున్న డిపో మేనేజర్‌ అశోక్‌రాజ్‌, తదితరులు

ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌ అశోక్‌రాజ్‌

యాచారం: విద్యార్థులకు ఉచిత బస్‌ పాసులను అందజేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌ అశోక్‌రాజ్‌ పేర్కొన్నారు. గునుగల్‌ ఆదర్శ పాఠశాలలో శనివారం ఆర్టీసీ అధికారులు 150 మంది విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్‌ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు నిత్యం ఇబ్రహీంపట్నం డిపో కార్యాలయానికి వచ్చి సమయాన్ని వృథా చేసుకోకుండా ఉండేందుకే పాఠశాలలకు వెళ్లి అర్హులైన విద్యార్థులకు బస్‌ పాసులను అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రయాణంలో ఇబ్బందులు రాకుండా కావాల్సిన రూట్లోనే బస్సులను నడిపిస్తామని అ న్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ సరస్వతి, గునుగల్‌ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ ఎమిమా, ఆర్టీసీ అధికారులు సదానందం, వీరన్న, మల్లేష్‌ యాదవ్‌, వైవిరెడ్డి, గంధం యాదగిరి, ప్రవీణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం

బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కడ్తాల్‌: బీజేపీతోనే నీతివంతమైన పరిపాలన అందుతోందని బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయమన్నారు. శనివారం మండలంలోని ఖానాపూర్‌, జంగారెడ్డి గ్రామాల్లో మహాజన్‌ సంపర్క్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా పాండు ఆధ్వర్యంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనలో అనేక అభివృద్ధి పథకాలను అమలు చేశారని అన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేంద్రం ఇచ్చిన నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతున్నాయని వివరించారు. కేసీఆర్‌ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరు కలసిరావాలన్నారు. కార్యక్రమంలో మనోహర్‌, చంద్రమౌళి, రాములు, నందు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్‌ పార్టీయే


రేవంత్‌రెడ్డిని కలిసిన రామకృష్ణయాదవ్‌, తదితరులు

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

యాచారం: ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్‌ శ్రేణులు పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్‌ శ్రేణులు శనివారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి నగరంలోని ఆయన నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ గెలుపునకు కృషి చేయాలని, మనమే అధికారంలోకి వస్తున్నాం.. కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బీజేపీ– బీఆర్‌ఎస్‌లు కలిసి పోయాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని సూచించారు. వ్యవసాయ పంటల రుణమాఫీ, ఉద్యోగ అవకాశాలు తదితర సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో యాచారం మండల పరిషత్‌ మాజీ ఉపాధ్యక్షుడు జి. రామకృష్ణయాదవ్‌, నాయకులు శ్రీనివాస్‌నాయక్‌, మల్లేష్‌ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలి


ఇబ్రహీంపట్నం: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ముదిరాజ్‌లను అసభ్యంగా దూషిస్తూ మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మక్తాల వెంకటయ్య, కల్వకుర్తి ఇన్‌చార్జి పుట్ట శేఖర్‌, ఆమనగల్లు మండల శాఖ అధ్యక్షుడు కేకే.శ్రీనివాస్‌లు డిమాండ్‌ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో పాడి కౌశిక్‌ రెడ్డికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక జాతీయ రహదారిపై రాజీవ్‌ చౌరస్తా వద్ద పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో మక్తాల వెంకటయ్య, పుట్ట శేఖర్‌, కేకే.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. పాడికౌశిక్‌ రెడ్డి అహంకారంతో ముదిరాజ్‌లను అవమానపరుస్తూ అసభ్యకరంగా మాట్లాడారని ఆరోపించారు. కార్యక్రమంలో కల్వకుర్తి, వెల్దండ, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల, ఆమనగల్లు మండలాల ముదిరాజ్‌ సంఘం నాయకులు యాదయ్య, యాదగిరి, రాఘవేందర్‌, మల్లేశ్‌, శేఖర్‌, పాండుప్రసాద్‌, పద్మ అనిల్‌, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: కౌశిక్‌రెడ్డి అసభ్యపదజాలంతో ముదిరాజ్‌ కులస్థులను దూషించడాన్ని నియోజకవర్గానికి చెందిన ఆ కులస్థులు తీవ్రంగా ఖండించారు. శనివారం ఇబ్రహీంపట్నంలో ముదిరాజ్‌లు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌ కులస్థులను దూషించిన కౌశిక్‌రెడ్డిని ఎక్కడ తిరిగిన అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రవీందర్‌, సతీష్‌, లింగం, చక్రపాణి పాల్గొన్నారు.

నక్షబాటను సరి చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తలకొండపల్లి: నక్షబాటను సరి చేయాలని బద్నాపూర్‌ గ్రామస్తులు తహసీల్దార్‌ కృష్ణకు శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని బద్నాపూర్‌ నుంచి లేమామిడికి వెళ్లనున్న నక్షబాటను చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లోని పట్టాదారులు బాటను ఆక్రమించి రాకపోకలకు అంతరాయం కల్పించారు. సంబంధిత అధికారులచే సర్వే చేయించి నక్షబాటను పునరుద్ధరించాలని వారు తహసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటయ్య, శంకరయ్య, పెంటారెడ్డి, శేఖర్‌, చెన్నయ్య, జంగయ్య పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు రూ.కోటి రుణాలు

సింగిల్‌విండో చైర్మన్‌ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు: ఆమనగల్లు సింగిల్‌విండో ద్వారా వానాకాలం పంటల సాగుకు రైతులకు రూ.1 కోటి పంట రుణాలు అందించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్‌, డీసీసీబీ డైరెక్టర్‌ గంప వెంకటేశ్‌గుప్తా చెప్పారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులు పంటలు సాగు చేసుకునేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచిందని చెప్పారు. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం రైతులకు రైతుబంధు సాయాన్ని రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఆమనగల్లు సింగిల్‌విండో ద్వారా ఈ సీజన్‌లో 1 కోటి రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటికే 15 లక్షల రూపాయల రుణాలు అందించినట్లు ఆయన వివరించారు. రైతులను మోసం చేసే వ్యాపారులపై ప్రభుత్వం చట్టప్రకారం చర్య తీసుకుంటుందని గంప వెంకటేశ్‌గుప్త హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సింగిల్‌విండో వైస్‌ చైర్మన్‌ సత్యం, డైరెక్టర్‌ జోగు వీరయ్య, సీఈఓ దేవేందర్‌, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గంప వెంకటేశ్‌గుప్తా